నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 13 ఫిబ్రవరి 2025 | MEDAK

నీటి సమస్య పరిష్కారం

తొగుట, ఫిబ్రవరి 12: మండలంలోని రాంపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నమస్తే తెలంగాణ దిన పత్రికలో ఈ నెల 10వ తేదీన రాంపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నీటి కటకట అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన మిషన్ భగీరథ డీఈ రాజు, ఏఈ విశ్లేశ్ బుధవారం రాంపూర్ గురుకుల పాఠశాలకు వెళ్లి నీటి సమస్యకు కారణమై పగిలిపోయిన పైపులైను బాగు చేయించి సమస్య పరిష్కరించారు.

పగిలిన పైపును బాగు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి12: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ శివాలితండాకు చెందిన బీఆర్ఎస్ గిరిజన నాయకుడు లకావత్ వెంకటేశ్ నాయక్ బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా జరిపించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆమెకు విజ్ఞప్తి చేసినట్లు వెంకటేశ్‌నాయక్ తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన లకావత్ వెంకటేశ్‌నాయక్

పాడిగింపా.. ఎన్నికలా..!

- రేపటితో ముగియనున్న పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు
- పదవీ కాలం పొడిగించాలని కోరుతున్న చైర్మన్లు
- ఇంకా ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- మరో ఆరునెలల్లో ఎన్నికల నిర్వహణ అనుమానమే
- మెదక్ జిల్లాలో కొత్తగా 29 పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు) పదవీ కాలం ఈనెల 14వ తేదీతో ముగుస్తోంది. వారి పదవీ కాలాన్ని పొడిగిస్తారా, లేక ప్రత్యేకాధికారుల పాలన తీసుకువస్తారా అనే చర్చ జరుగుతున్నది. ఏడాది క్రితం గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం, ఆరునెలల క్రితం మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. కానీ, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో సహకార సంఘాల ఎన్నికలు కూడా ఇప్పట్లో నిర్వహించక పోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. జనవరి 30తో మున్సిపాలిటీల పదవీకాలం ముగిసింది. దీంతో మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలతో పాటు కొత్తగా ఏర్పడిన బల్దియాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

మెదక్ జిల్లాలో 37 పీఏసీఎస్‌లు

మెదక్ జిల్లాలో ప్రస్తుతం 37 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. మెదక్ మండలం మెదక్, మాచవరం, హవేళీఘనపూర్ మండలం నాగాపూర్, ఫరీద్‌పూర్, పాపన్నపేట మండలంలో పాపన్నపేట, కొత్తపల్లి, చీకోడ్, రామాయంపేట మండలంలో రామాయంపేట, కోనాపూర్, నిజాంపేట మండలంలో కల్వకుంట్ల, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలంలో చిన్నశంకరంపేట, జంగరాయి, మడూరు, చందంపేట్, కొల్చారం మండలంలో కొల్చారం, రంగంపేట్, వరిగుంతం, రాంపూర్, కిష్టాపూర్, అంసాన్‌పల్లి, కొంగోడ్, కౌడిపల్లి మండలంలో మహ్మద్‌నగర్, చేగుంట మండలంలో రెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్, నార్సింగి మండలంలో నార్సింగి, తూప్రాన్ మండలంలో తూప్రాన్, వెల్దుర్తి మండలంలో వెల్దుర్తి, శివ్వంపేట మండలంలో శివ్వంపేట, నర్సాపూర్ మండలంలో నర్సాపూర్, రేగోడ్ మండలంలో రేగోడ్, అల్లాదుర్గం మండలంలో అల్లాదుర్గం, టేక్మాల్ మండలంలో టేక్మాల్, చిలిపిచెడ్ మండలంలో సోమక్కపేట, పెద్దశంకరంపేట మండలంలో పెద్దశంకరంపేటలో సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారుగా 76 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు, బంగారం తాకట్టు, వాహన, ఇతర రుణాలు అందజేసున్నారు. కొన్ని సొసైటీలు ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్నాయి. పెట్రోల్ బంకులు నిర్వహణ, యంత్రాలు కిరాయికి ఇవ్వడం వంటి వ్యాపారాలు చేస్తున్నాయి.

29 కొత్త సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

మండలానికి రెండు సహకార సంఘాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు మెదక్ జిల్లాలో కొత్తగా 29 సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. దానిపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత ఆయా సంఘాల పరిధిలోని రైతులను కొత్త సంఘాల్లో చేర్చి సభ్యత్వాలు ఇస్తారు. ఓటర్ల జాబితాలు, డైరెక్టర్ల వారీగా ఓటర్ల జాబితా రూపొందించాల్సి ఉంటుంది. ఈ తంతు పూర్తి కావడానికి నాలుగైదు నెలలైనా పడుతుంది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తే గానీ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో రైతులకు విస్తృత సేవలు అందించే సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడిగిస్తారా, ప్రత్యేకాధికారులను నియమిస్తారా అనే విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఓటర్ల జాబితాల రూపకల్పన ఇప్పటి వరకు మొదలు కాలేదు. దీంతో మరో ఆరు నెలలకు గానీ ఎన్నికలు జరిగే పరిస్థితి కనబడడం లేదు. జిల్లాలో కొత్తగా మరో 29 సంఘాల ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, వాటిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది..

ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 14వ తేదీతో ముగియనున్నది. పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తారా, ప్రత్యేక అధికారులను నియమిస్తారా అనే విషయమై ఏమి తెలియదు. మెదక్ జిల్లాలో ఇప్పుడున్న 37 సంఘాలకు తోడు మరో 27 కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

–కరుణాకర్,
సహకార శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి మెదక్

మాటలు చాలించి పనులు చేయండి

- మంజూరైన రోడ్ల పనులు ఎందుకు చేపట్టడం లేదు..
- అభివృద్ధి చేతకాకపోతే రాజీనామా చేయాలి
- ఎమ్మెల్యే, ఎంపీ చిత్తశుద్ధిని చాటుకోవాలి
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శలు
- నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో



కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన రోడ్డు పనుల ఉత్తర్వులు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12: అనేక హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి గెలిచిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే, కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సైతం చేపట్టకపోవడం మూలంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అభివృద్ధి చేయడం చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం నారాయణఖేడ్ పట్టణంలోని జూకల్ క్రాస్‌రోడ్డులో రాస్తారోకో చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. నారాయణఖేడ్ నుంచి జూకల్, చందాపూర్, సత్యగామ, అనంతసాగర్, బంద్రాన్‌పల్లి వరకు రోడ్డు అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం రూ.1.48 కోట్లు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది గడిచినా రోడ్డు పనులు ఎందుకు చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇదే రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకుడు చేశారని, నాణ్యతాలోపంగా పనులు చేపట్టడంతో రెండేండ్లలోనే రోడ్డు గుంతలమయంగా తయారైందన్నారు. అనంతసాగర్ నుంచి మియాపూర్ తండాకు రూ.1.32 కోట్లు, అంత్వార్ నుంచి సత్యగామ క్రాస్‌రోడ్డు వరకు రూ.33 లక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల నిర్బంధాలతో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలను మళ్లీ మభ్య పెట్టేందుకు జిమ్మిక్కులు చేస్తున్నదని విమర్శించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహకారంతో 50 ఏండ్ల కాంగ్రెస్ హయాంలో జరగని అభివృద్ధిని తాను కేవలం ఏడేండ్లలో చేసి చూపించినట్లు మహారెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో బడా భూస్వాములకు లక్షల కొలది రైతుబంధు వచ్చిందని ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యేకు, అతడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఎన్ని లక్షలు వచ్చాయో చెప్పడం లేదని, నిజాయతీ ఉంటే తీసుకున్న రైతుబంధు తిరిగి ప్రభుత్వానికి జమ చేసి మాట్లాడాలని హితవు పలికారు. ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరు కలిసి పైసా అభివృద్ధి పని చేయలేదన్నారు. ఇప్పటికైనా నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి, పథకాల అమలుకు ఎమ్మెల్యే, ఎంపీ చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు. ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో రోడ్డుకిరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిని సముదాయించి ఆందోళనను విరమింపజేశారు. ఆందోళనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రవీందర్‌నాయక్, ముజామిల్, విఠల్, వెంకటేశం, లక్ష్మణ్‌రావు, రాజు, నర్సింహులు, సాల్మన్, దత్తు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లోని జూకల్ క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆరోగ్య రంగానికి ప్రాధాన్యమివ్వాలి

- గీతం వర్సిటీ సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఆకెళ్ల

జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఆకెళ్ల వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 12 : ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గీతం హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం 'ఫార్మాస్యూటికల్, ఆరోగ్య శాస్త్రాల్లో సమగ్ర ధోరణులు' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సును ఆకెళ్ల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యరంగం అభివృద్ధి చెందితేనే రోగాల నుంచి ప్రజలను రక్షించవచ్చన్నారు. ఆరోగ్యరంగంలో తగిన పెట్టుబడులు ఎంతైనా అవసరమని, ప్రజారోగ్యం మెరుగుపర్చేందుకు, అసమానతలు తగ్గించడం వంటి దీర్ఘకాలిక సామాజిక ప్రయోజనాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. నూతన ఆవిష్కరణలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తున్నట్లు చెప్పారు. వైద్యరంగానికి అంతంతమాత్రం కేటాయింపులు, రాజకీయ సంక్షోభాలు, మౌలిక సదుపాయా లేమి, అన్‌స్కిల్డ్ శ్రామిక శక్తి వంటి సవాళ్లను వైద్యరంగానికి సవాలుగా మారినట్లు తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ హెల్త్ కేర్, టెలీమెడిసిన్, వ్యక్తిగతీకరించిన వైద్యం వంటి వినూత్న పరిష్కారాలతో మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని ఆకెళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతి పౌరుడికి సరైన వైద్యం, మందులు అందినప్పుడే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమన్నారు. సీడీఎస్ సీవో హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామ్‌కిషన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 7,129 వ్యాధులు గుర్తించారని, వాటిలో 85 అతి ప్రమాదకరమైనవని పేర్కొన్నారు. ఆరోగ్య సంస్కరణలు, క్లినికల్ ట్రయల్స్, పరిశోధనల్లో ప్రభుత్వాలు తమ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సులో ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్ దాస్, వీసీ ప్రొఫెసర్ డీఎస్ రావు, డాక్టర్ రెడ్డీస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ పరిమల్ మిశ్రా, హైదరాబాద్ నైపర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్ నండూరి, పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వినోద్‌కుమార్, క్రోయోషియాలోని సెంటర్ ఫర్ ఇన్ఫర్మేటిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ జురికా నోవాక్, నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

గీతం సదస్సుకు హాజరైన విద్యార్థులు, ప్రతినిధులు

డంపింగ్‌యార్డు వద్దే వద్దు

- ఊరూరా కొనసాగుతున్న నిరసనలు
- మొన్న బర్రెలతో... నేడు గొర్రెలతో వినూత్న నిరసన
- గుమ్మడిదల ఎన్‌హెచ్‌పై మూగజీవాలతో రోడ్డెక్కిన ఆందోళనకారులు
- గుమ్మడిదలలో రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష
- నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్‌లో 8వ రోజుకు చేరిన నిరాహార దీక్షలు
- గుమ్మడిదల తహసీల్దార్‌ను అడ్డుకున్న ఆందోళనకారులు

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా జాతీయ రహదారిపై గొర్రెలతో నిరసన తెలుపుతున్న రైతు జేఏసీ, అఖిలపక్ష నాయకులు

కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 12: సంగారెడ్డి జిల్లా ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలంటూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుధవారం గుమ్మడిదల మున్సిపాలిటీలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి–765డీ పై గొర్రెలు, మేకలతో నిరసన తెలిపారు. మొన్న బర్రెలు, నిన్న గొర్రెలతో నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. గుమ్మిడిదల మున్సిపాలిటీలో రెండోరోజు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బుధవారం తహసీల్దార్ గంగాభవానీ దీక్షా శిబిరం వద్దకు వచ్చి ఆందోళకారులకు డంపింగ్ యార్డుపై అవగాహన కలిగించడానికి ప్రయత్నించింది. తహసీల్దార్‌ను రైతు జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో తమ బతుకులు ఆగమైతాయన్నారు. కాలుష్యంతో ఊర్లను విడిచి పోవాలా అని తహసీల్దార్‌ను నిలదీశారు. ప్రజాభిప్రాయం లేకుండా అటవీప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఎట్టి పరిస్థితిలో డంపింగ్‌యార్డు ఏర్పాటు కానివ్వమమని తేల్చిచెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. పార్టీ పెద్దల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి డంపింగ్‌యార్డు పనులు నిలిపివేసేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కొత్తపల్లి, నల్లవల్లిలో నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరాయి. గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్టనర్సింగ్‌రావు, గుమ్మడిదల, బీజేపీ జిన్నారం మండల అధ్యక్షుడు ఐలయ్య, జగన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంగేటి ప్రతాప్‌రెడ్డి, అండూర్ నర్సింగ్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, ఆలేటినవీనా శ్రీనివాస్‌రెడ్డి, దోమడుగు శంకర్, ఆంజనేయులు,రామప్ప, జేఏసీ నాయకులు ఫయాజ్ షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, మధు, మల్లేశ్ గౌడ్, కుల సంఘాలు, మహిళాసంఘాలు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిదల రిలే నిరాహార దీక్షలో సంఘీభావం తెలుపుతున్న గోదావరి అంజిరెడ్డి

గుమ్మడిదల రిలే నిరాహార దీక్షలో డంపింగ్‌యార్డుపై అవగాహన కలిగిస్తున్న తహసీల్దార్ గంగాభవానీని అడ్డుకున్న రైతు జేఏసీ నాయకులు

హైకోర్టు ఆదేశాలతో పనులు నిలిపివేత

నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులను సర్వే కారణంగా తాత్కాలికంగా నిలిపి వేసినట్లు తహసీల్దార్ గంగాభవానీ తెలిపారు. ప్యారానగర్‌కు చెందిన కొందరు తమ భూముల్లో డంపింగ్‌యార్డు పనులు చేపడుతున్నారని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో సర్వేచేసే వరకు డంపింగ్‌యార్డు పనులు నిలిపివేశామని, ఈనెల 13వ తేదీ నుంచి 19 వరకు సర్వేచేసి హద్దులు సూచిస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం యథావిధిగా పనులు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. డంపింగ్‌యార్డుపై మండల ప్రజలకు అపోహలు, భయాలు ఉన్నాయని, పూర్తిగా యూరోపియన్ టెక్నాలజీతో జీరో వేస్ట్‌తో వేస్ట్ మేనేజ్‌మెంట్ డిస్‌పోజల్ ప్రాజెక్ట్ అని తహసీల్దార్ తెలిపారు. దీనిని రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందన్నారు. దీనిపై అపోహలు పోవడానికి దుండిగల్ శివారులోని గడ్డపోతారంలో ఉన్న రాంకీ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌కు తీసుకుపోయి అపోహలు తొలిగించడానికి ప్రయత్నిస్తామని ఆమె తెలిపారు.

ఎండుతున్న పొలాలు

- వేధిస్తున్న అప్రకటిత కరెంట్ కోతలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీళ్లు లేక బోరుమంటున్న బోరుబావులు
- ఆందోళనలో అన్నదాతలు

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లిలోబోరు నుంచి తక్కువగా వస్తున్న నీరు

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లిలో ఎండిన రైతు మహిపాల్‌రెడ్డి పొలం

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 12: యాసంగిలో సాగుచేస్తున్న వరి పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఎండిన పంటపొలాలను పశువుల మేతకు వదిలి పెట్టి, పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతన్నలు దీనంగా చూస్తున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని నర్సాయపల్లికి చెందిన రైతు మంతెన మహిపాల్‌రెడ్డికి నాలగున్నర ఎకరాల భూమిలో మూడెకరాల భూమిలో వరి పంట, మిగతా ఎకరం 20గంటల భూమిలో నువ్వులు, మినుములు, పెసర పంటలతో పాటు కూరగాయ పంటలను వేశాడు. ఈ పంటలకు నీటిని అందించేందుకు మూడు బోరుబావులు ఉన్నాయి. నిన్నమొన్నటి వరకు పైపుల నిండా పోసిన బోరుమోటర్లు నీళ్లు లేక నల్లా నీళ్ల మాదిరిగా గ్యాప్ ఇచ్చుకుంటూ పోస్తుండడంతో సుమారు ఎకరం వరి పంట అర ఎకరంలోని వివిధ పంటలు ఎండిపోతున్నాయి. వేసవికి ముందే పంటలు ఎండిపోతుండడంతో మరో రెండు నెలల పాటు పంట పొలాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక రైతు మహిపాల్‌రెడ్డి ఆందోళన చెందుతున్నాడు. దీనికి తోడు సాయంత్రం వేళ 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కరెంట్ కట్ చేస్తున్నారని, 10గంటల తర్వాత కరెంట్ వస్తుండడంతో కొన్నిమార్లు ఫ్యూజ్‌వైర్లు పోయి బోరుమోటర్లు నడవని పరిస్థితి ఏర్పడుతుండడంతో రాత్రిళ్లు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రైతు వాపోయాడు. మూడెకరాల వరి సాగుకు రూ. 50వేల వరకు ఖర్చుచేశానని, పంటలు ఎండిపోతుండడంతో పెట్టుబడి మీదపడి అప్పుల పాలు అయ్యేలా ఉందని రైతు మహిపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

మూడు బోరుబావుల్లో నీళ్లు లేవు

ఎండకాలం రాకముందే బోరుబావుల్లో నీళ్లు పాతాళానికి పోయినయి. బోరుబావుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయి. నిన్నమొన్నటి వరకు చెరువు, కుంటల్ల నీళ్లు ఉండడంతో బోరుబావుల్ల నీళ్లు ఉండేవి. ఇప్పుడు చెరువు, కుంటలు కూడా ఎండిపోతున్నయి. ఎండిన చెరువు, కుంటల్ల నీళ్లు నింపితే బోరుబావుల్ల నీళ్లు ఉండేది. నేను 2006 నుంచి ఎవుసం చేస్తున్న నాకు ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదు. మూడు బోరుమోటర్లు ఇప్పుడు నల్ల పోసినట్లు గ్యాప్ ఇచ్చుకుంట పోస్తున్నయి. ఇప్పటికైతే ఎకరం వరి పంట పూర్తిగా ఎండిపోయింది. రేపు అయింతా పంట కూడా ఎండిపోతదన్న డౌట్ వస్తుంది. అసలే బోర్లల్ల నీళ్లు లేక ఆగమైతుంటే కరెంటోళ్లేమో సాయంత్రం 5గంటలకే కరెంట్ తీసేస్తున్నరు. మల్ల రాత్రి 10గంటలకు కరెంట్ వస్తుంది. అప్పుడు స్టార్లర్ల ఫ్యూజ్ వైర్లు కూడా పోతున్నయి. దీనికోసం రాత్రి పూడ ఎన్కట లెక్కనే బావులకాడికి పోయి

పండుకోవాల్సి వస్తుంది. ఎండిన వరిపొలంలో చేసేది ఏమిలేక బర్లను మేపుతున్న. మూడెకరాల వరి పొలానికి రూ. 50వేల పెట్టుబడి అయ్యింది. ప్రభుత్వం రైతుబంధు కూడా ఇయ్యకపాయే పెట్టుబడి కోసం కూడా అప్పు చేసిన, పంటలు గిట్ల ఎండిపోతే అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వం ఇప్పటికైనా జాగ్రత్తపడి చెరువు, కుంటల్ల నీళ్లు విడవాలి. ఎండిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి నాలాంటి రైతులను ఆదుకోవాలి.

-మహిపాల్‌రెడ్డి, రైతు, నర్సాయపల్లి (సిద్దిపేట జిల్లా)